ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 18 మే 2024

- పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న సీజన్
- వాతావరణం అనుకూలమని చెబుతున్నా సబ్సిడీ విత్తనాల ఊసేలేదు



- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

పెనుమూరు మండలం సీఎస్ అగ్రహారంలో దుక్కి దున్నుతున్న రైతు

ఖరీఫ్ సాగుకు ప్రణాళికేదీ?

ఖరీఫ్ సీజన్ మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ ఏడాది రుతుపవనాలు అనుకూలంగా ఉంటాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే దానికి తగినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేయకపోవడం విమర్శలు దారితీస్తోంది. సబ్సిడీపై అందించే వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు ఎప్పుడు ఇస్తారనే దానిపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. సాధారణంగా మే మూడో వారంలోనే రైతులు దుక్కులతోపాటు వేరుశనగ విత్తనాలు శుద్ధి చేసుకుని సిద్ధం కావాల్సి ఉంది.

- చిత్తూరు (సెంట్రల్)

ఆర్‌బీకేల్లో సమాచారం కరవు

రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులకు సంబంధించిన సమాచారం అడిగినా చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారు. 244 ఆర్‌బీకేల్లో క్లస్టమైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, సాగులో రైతులకు అవసరమైన పరికరాలు ఏవేవి అందుబాటులో ఉన్నాయి..వాటి అద్దె ఎంత అనే వివరాలు ప్రదర్శించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

అందని మట్టి నమూనా ఫలితాల కార్డులు

మట్టిలో లోపాలను తెలుసుకుని, తగిన పోషకాలు నేలకు అందించడంలో భూసార పరీక్షలు కీలకం. జిల్లావ్యాప్తంగా 6,860 మట్టి నమూనాలు సేకరించిన అధికారులు, ఫలితాల కార్డులను రైతులకు అందించలేదు. కాగా వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింది 2024-25 సంవత్సరానికి 9 క్లస్టర్లను ఎంపిక చేశారు. వీటి కార్యాచరణపై ఇప్పటివరకు స్పష్టత లేదు.

సాగు విస్తీర్ణం లెక్కలేవి సారూ?

ఏటా ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 2.22 లక్షల మంది రైతులు 2,27,500 ఎకరాల్లో దాదాపు 23 రకాలైన పంటలు సాగు చేస్తుంటారు. వర్షాధారిత ప్రధాన పంటగా వేరుశనగ, తూర్పు మండలాల్లో వరి, చెరకు, పశుగ్రాసం, రాగి, కందులు, ఉలవలు, అనుములు, ఆముదం, మొక్కజొన్న, కొర్రలు, సామలు, పెసర, పత్తి వంటి పంటలు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ఈ ఏడాది ఎంతమంది రైతులు ఏయే రకాల పంటలు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే దానిపై జిల్లా వ్యవసాయాధికారులు ఇప్పటివరకు లెక్కలు కట్టలేదు.

ఊసేలేని సబ్సిడీ విత్తనాలు

ఖరీఫ్‌లో సాధారణంగా జిల్లాలో 1,27,500 ఎకరాల్లో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేస్తారు. ఇందుకనుగుణంగా 38,688 క్వింటాళ్ల వేరుశనగ, 1,548 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 32,836 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాలని జిల్లా వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏటా మే మూడో వారంలో సబ్సిడీ విత్తనకాయలు జిల్లాలోని 502 రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. ఈ ఏడాది ఇప్పటివరకు సబ్సిడీ ధరలు నిర్ణయించకపోవడంతో విత్తనకాయల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఉద్యాన పంటలపై దృష్టి

వ్యవసాయాధికారుల నిర్లక్ష్య వైఖరిపై విసుగుచెందిన రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. రెండేళ్లుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా బావులు, చెరువులు, కుంటల్లో నీరు చేరాయి. దీంతో రైతులు నీటి ఆధారిత పంటలు సాగు చేశారు. ఈ ఏడాది సరైన ప్రణాళిక లేకపోవడంతో పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, కుప్పం ప్రాంత రైతులు కూరగాయలు, పూలు, పట్టు తదితర పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు.

డిన్నర్‌కు వచ్చి.. మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తమిళనాడు యువకుల మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- తడుకుపేట వద్ద ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

నగరి, మే17: స్నేహితుడి ఇంటికి డిన్నర్ కోసం వచ్చి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తమిళనాడు యువకులు మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని తడుకుపేట జగనన్న హౌసింగ్ కాలనీ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు కన్యాకుమారి జిల్లా రామనాథపురానికి చెందిన కన్నన్(28), ఇళంగోవన్(26), నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడకు చెందిన సంజయ్(29) చెన్నై తాంబరంలోని రెడిమేడ్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్నారు. సంజయ్ ఇంట్లో డిన్నర్ ఉండడంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ వెళుతుండగా తడుకుపేట జగనన్న హౌసింగ్‌కాలనీ వద్ద ఆగి ఉన్న వ్యానును వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కన్నన్, ఇళంగోవన్ అక్కడికక్కడే మృతిచెందారు. సంజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు విరిగిపోవడంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తి చేసి, శుక్రవారం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.



కన్నన్, ఇళంగోవన్ (ఫైల్ ఫొటో)

లారీ-బైక్ ఢీ : విద్యార్థి మృతి

బంగారుపాళ్యం, మే 17: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం పాతపేటకు చెందిన మురుగేష్ కుమారుడు సురేష్ సొంత పనుల నిమిత్తం బైక్‌లో బంగారుపాళ్యంకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా మొగిలి ఘాట్‌లో మరమ్మతులకు గురై ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సురేష్ (21) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పలమనేరులోని ఒక ప్రైవేటు కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్నాడు. సురేష్ మృతిపట్ల తోటి విద్యార్థులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.



సురేష్ (ఫైల్ ఫొటో)

కూల్..కూల్

జిల్లాలో చల్లబడిన వాతావరణం



రామకుప్పంలో కురుస్తున్న వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 17: ఎండలు మండిపోవాల్సిన సమయంలో వాతావరణంలో మార్పులొచ్చాయి. నెలన్నరగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ జిల్లా ప్రజలు వారం రోజులుగా చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. మరో వారం రోజులు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు వచ్చాయని అంటున్నారు. వారం తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని చెబుతున్నారు. కాగా జిల్లాలో శుక్రవారం అత్యధికంగా పులిచెర్లలో 35.4 డిగ్రీలు, అత్యల్పంగా గుడుపల్లెలో 29.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎనిమిది మండలాల్లో వర్షం

జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు ఎనిమిది మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. పాలసముద్రం, వి.కోట, పులిచెర్లలో 18.2, రొంపిచెర్ల 16.4, పెద్దపంజాణి 10.4, చౌడేపల్లి 9.4, సదుం 6.4, బైరెడ్డిపల్లిలో 4.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు, మే 17: 2024-25 విద్యా సంవత్సరానికి చిత్తూరు నగర శివారులోని మురకంబట్టు ఉన్న మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 6 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి చిన్నారెడ్డి తెలిపారు. 5వ తరగతిలో 63సీట్లు, 6వ తరగతిలో 55, 7వ తరగతిలో 48, 8వ తరగతిలో 47 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. బోధనతోపాటు వసతి, భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలు, వైద్య సౌకర్యం లాంటి వసతులున్నాయని వివరించారు. ఇతర వివరాల కోసం 8712625058, 9441155061లలో సంప్రదించాలని కోరారు.

30రోజుల్లోగా ఖర్చుల వివరాలివ్వండి

చిత్తూరు కలెక్టరేట్, మే 17: ఎన్నికల ఫలితాలు వెలువడిన 30రోజుల్లోగా అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను సమర్పించాలని అధికారులు కోరారు. చిత్తూరు పార్లమెంటు స్థానానికి 19మంది,ఏడు అసెంబ్లీ స్థానాలకు 78 మంది పోటీలో నిలబడ్డారు. ఈసీ నిబంధనల మేరకు అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.90 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మే 17: టెన్త్ అడ్వాన్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలోని 2,006 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా విద్యాశాఖ అధికారులు 15 కేంద్రాలను గుర్తించారు. కాగా ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 1,561 మంది పరీక్షలు రాసేందుకు వీలుగా 9 కేంద్రాలను గుర్తించారు.

రేషన్ సరుకుల పంపిణీకి నేటి వరకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్, మే17: జిల్లావ్యాప్తంగా మే నెల రేషన్ కోటా శుక్రవారం నాటికి 66,049 మంది తీసుకోలేదు. 5,43,202 కార్డులకు గాను 4,77,153 కార్డుదారులు మాత్రమే రేషన్ స్వీకరించారు. పోర్టబిలిటీ ద్వారా 88,255 మంది రేషన్ పొందారు. ఇప్పటివరకు 87.84 శాతం పంపిణీతో జిల్లా 18వ స్థానంలో నిలిచింది. ఇంకా రేషన్ పొందని వారి కోసం ప్రభుత్వం ప్రజా పంపిణీకి శనివారం వరకు గడువు పెంచింది. ఎండీయూ వాహనదారులు శనివారం మధ్యాహ్నం స్థానిక సచివాలయాల దగ్గర రేషన్ పంపిణీ చేయాలని డీఎస్వో శంకరన్ ఆదేశించారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న ఎండీయూ వాహన ఆపరేటర్లు, రేషన్ డీలర్ల స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

స్ట్రాంగ్ రూముల వద్ద అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు, మే 17: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూముల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పొరబాట్లకు తావివ్వకుండా పనిచేయాలన్నారు. ఏఎస్పీ అరీఫుల్లా, ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్‌బీ సీఐ మనోహర్, ఆర్ఐలు నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు →





భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు

పొన్నియమ్మను దర్శించుకుంటున్న భక్తులు





పొన్నియమ్మ ఆలయంలో పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మే 17: నగరంలో నాలుగు రోజులుగా చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. పొన్నియమ్మ ఆలయంలో అమ్మవారికి జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకే లావణ్యబాబు కుటుంబ సభ్యులతో కలిసి పొంగలి పెట్టారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలోనూ భక్తులు పొంగళ్లు పొంగించారు. సంతపేట, మంగసముద్రం, ఓబనపల్లె, మంగసముద్ర హౌసింగ్ కాలనీ, మురకంబట్టు, దొడ్డిపల్లె, కొంగారెడ్డిపల్లె, ప్రశాంత్‌నగర్ కాలనీల్లోని ఆలయాల్లోనూ భక్తులు పొంగళ్లు పెట్టారు.

టీడీపీ నేతల రిమాండ్ తిరస్కరించిన కోర్టు

పోలీసులకు చురకలు అంటించిన జడ్జి

యాదమరి మే 17: ఈనెల 13న పోలింగ్ సందర్భంగా మండలంలోని మాదిరెడ్డిపల్లిలో వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. పోలీసులు మాత్రం టీడీపీకి చెందిన ఎంకే విజయంద్ర యాదవ్, కే మనోహర్ యాదవ్, బాలాజీ యాదవ్, కేశవులు యాదవ్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం రాత్రి ఒకటో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్టులో 13వ తేదీన నిందితులను అరెస్టు చేసినట్లు చూపడంతో జడ్జి ముద్దాయిలను అడిగి వివరాలు నమోదు చేసుకుని, రిమాండ్‌ను తిరస్కరించారు. పోలీస్ స్టేషన్‌లోనే వారికి 41ఏ నోటీసులు ఇచ్చి పంపాలని ఆదేశించారు. కాగా చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్‌రెడ్డి తమను చిత్రహింసలు పెట్టారని నిందితులు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా సీఐకు చురకలు అంటించారు.

చేస్తారా....చేయరా?

డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌కు వైసీపీ ముఖ్య నేత ఒత్తిడి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విలువైన డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేసివ్వాలంటూ వైసీపీ ముఖ్యనేత అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గవ్యాప్తంగా వందలాది ఎకరాల డీకేటీ భూములను కొద్ది నెలల క్రితం ఫ్రీ హోల్డ్ జాబితాలో పెట్టారు. డీకేటీ పట్టా పొంది 20 ఏళ్ల పూర్తయిన భూములను ఫ్రీ హోల్డ్‌గా గుర్తించారు. వైసీపీ ముఖ్యనేత తన అనుచరులతో కొద్దినెలల క్రితం ఈ భూములను కొనుగోలు చేయించినట్లు ఆరోపణలున్నాయి.ఆయనకు సన్నిహితంగా మెలిగిన అనుచరుడు ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.వాటిలో ఒకటి డీకేటీ భూముల స్కాం. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఐదు రోజుల క్రితం పోలింగ్ ముగియడంతో వైసీపీ ముఖ్యనేత చాపకింద నీరులా డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ పనులను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రెవెన్యూ అధికారులను పిలిపించి ఆయా మండలాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో వుంటుందని, అప్పటిదాకా రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వలేమంటూ కొందరు అధికారులు చేతులెత్తేసినట్లు తెలిసింది.అయితే ఎలాగైనా చేయాలంటూ ఆయన ఒత్తిడి చేస్తుండడంతో విషయం బయటకు పొక్కింది.

ఈసీ నియమిత సిట్‌లో ఏసీబీ డీఎస్పీకి చోటు


రవిమనోహరాచారి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లో తిరుపతి ఏసీబీ డీఎస్పీ కె.రవిమనోహరాచారికి చోటు దక్కింది. ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం ఈయన పనిచేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్ వంటి మూడు కీలక విభాగాల్లో విధులు నిర్వర్తించిన ఈయనకు ఈ ప్రాంతంపై సమగ్రమైన అవగాహన, ఇక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో అవగాహన వున్నాయి. అనేక సంచలనాత్మక కేసులను పరిష్కరించి సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందారు. తాజాగా ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయడం వంటివి సిట్‌కు ఈసీ అప్పగించిన బాధ్యతలు. సిట్‌లో మొత్తం 13మంది సభ్యులుండగా అందులో రాయలసీమ నుంచీ ఎంపికైన ఇద్దరు అధికారుల్లో రవిమనోహరాచారి ఒకరు. ఈసీ ద్వారా ప్రత్యేక దర్యాప్తు బృందంలో నియమితులు కావడం ఆయన సమర్థతకు, అనుభవానికి దక్కిన గుర్తింపుగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 76,369 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,927 మంది తలనీలాలు సమర్పించారు.

ఐకేఎస్‌తో వేదవర్సిటీ ఎంవోయూ

తిరుపతి రూరల్, మే 17: వైదిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న వైజ్ఞానిక విశేషాలను వెలికితీసి సమాజానికి అందించేందుకు తిరుపతిలోని ఎస్వీ వేద వర్సిటీతో భారతప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖకి చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఐకేఎస్ జాతీయ కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణ మూర్తి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐకేఎస్ కథనాలు రాయడం, పురాతన వేదగ్రంథాల ప్రామాణికమైన అనువాదాలను అన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం ద్వారా కంటెంట్ అభివృద్ధి, మాన్యుస్క్రిప్ట్ డిజిటలైజేషన్, పురాతన పురాణాల నుంచి శాస్త్రీయ కంటెంట్‌తో సామాజిక ఔచిత్యంగల గ్రంథాలను గుర్తించడం, వాటిని సవరించడం, ప్రచురించడం, వేదమూలాలపై సెమినార్లు, వర్క్‌షాప్స్, కాన్ఫరెన్స్‌లు, వివిధ ఆచారాల ఆడియో-విజువల్ రికార్డులను రూపొందించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని వీసీ వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, డీన్ గోలిసుబ్రహ్మణ్యశర్మ, రాధేశ్యామ్, ఎంవీఎస్ పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కాఫీబార్ యజమాని మృతి


రాజన్న మృతదేహం

గంగవరం, మే 17: పలమనేరు - బెంగళూరు రహదారిలో జరిగిన రోడ్డుప్రమాదంలో కాఫీబార్ యజమాని మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గండ్రాజుపల్లె పంచాయతీ అనంతపురం గ్రామానికి చెందిన రాజన్న (58) గ్రామ సమీపంలోని హైవే రోడ్డుపై కాఫీబార్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటినుంచి కాఫీబార్‌కు వెళ్లడానికి రోడ్డుపక్కన నడిచి వెళ్తుండగా బెంగళూరు నుంచి పలమనేరు వైపు వస్తున్న కేఏ05ఎంయూ 0710 నెంబరు గల క్వాలిస్ వాహనం వేగంగా ఆయన్ను ఢీకొంది. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం


మృతదేహాలకు దహన క్రియలు చేస్తున్న తండ్రి బాబు

వడమాలపేట, మే 17: ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి చెందడంతో ఎస్‌బీఆర్ పురం శోకసంద్రంలో మునిగిపోయింది. వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు రూపిక(10), చరిత(13), యూషిక గురువారం దిగువ గూళూరు గూళూరు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలను తీసుకువచ్చారు. చిన్నారుల మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి బాబు తన కుమార్తెల మృతదేహాలకు దహన క్రియలు నిర్వహించారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు


కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 17: ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను పరిశీలించేందుకు వీలుగా ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీసీ టీవీ కెమెరాల డిస్‌ప్లే స్ర్కీన్‌ను ఏర్పాటు చేశామని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఎస్వీసెట్‌లో భద్రపరచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయన ఎస్పీ మణికంఠ చందోలు, ఎన్నికల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ అధికారులకు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల కింద సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవో జి.చిన్నయ్య, ఏఎస్పీ అరీఫుల్లా, కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు పాల్గొన్నారు.

ఏనుగుంటపల్లిలో అత్యధికంగా 95.44శాతం పోలింగ్

అత్యల్పంగా చిత్తూరు నాయుడు బిల్డింగ్స్ 67వ బూత్‌లో 58.61శాతం - 48 పోలింగ్ కేంద్రాల్లో 90శాతానికి మించి..

చిత్తూరు కలెక్టరేట్, మే 17: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నడూ లేనివిధంగా 81.24 పోలింగ్ శాతం నమోదయ్యింది. 2,02,850 మంది ఓటర్లలో 1,64,788 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిత్తూరు నగరంలో 150, చిత్తూరు రూరల్‌లో 31, గుడిపాలలో 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చిత్తూరు రూరల్ మండలం ఏనుగుంటపల్లికి చెందిన 153వ పోలింగ్ కేంద్రంలో రికార్డుస్థాయిలో 95.44 శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా చిత్తూరు నగరం నాయుడు బిల్డింగ్స్‌కు చెందిన 67వ పోలింగ్ కేంద్రంలో 923 మంది ఓటర్లకుగాను 541 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ అత్యల్పంగా 58.61శాతం పోలింగ్ నమోదైంది. రామ్‌నగర్ కాలనీలోని 82వ పోలింగ్ కేంద్రంలో 1,179 ఓటర్లకు గాను 704 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 59.71శాతం పోలైంది. నగరంలోని ఇరువారం (113వ పోలింగ్ కేంద్రం)లో 94.25, చెన్నమగుడిపల్లి (109వ పోలింగ్‌కేంద్రం) 92.03, నాయిబ్రహ్మణకాలనీ (114వ పోలింగ్‌కేంద్రం) 91.64శాతం, బండపల్లి (51వ పోలింగ్‌కేంద్రం) 91.27శాతం, పీహెచ్‌వాడ కాలనీ (126వ పోలింగ్‌కేంద్రం) 90.13శాతం, నరిగపల్లి (122వ పోలింగ్‌కేంద్రం) 90.11, గుడిపాల మండలం సి.బండపల్లి పోలింగ్ కేంద్రంలో 94.63శాతం, కట్టకిందపల్లి హెచ్‌డబ్ల్యూ పోలింగ్ కేంద్రంలో 94.46శాతం పోలింగ్ అయ్యింది. 90శాతానికి మించి 48 కేంద్రాల్లో, 80శాతానికి మించి 91 కేంద్రాలు, 70శాతానికి మించి 67 కేంద్రాలు, 60శాతానికి మించి 18, అంతకులోపు రెండు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలును పరిశీలించిన కలెక్టర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ భద్రత పటిష్టంగా ఉందన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు నిత్యం బందోబస్తు నిర్వహిస్తున్నారని వివరించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ భద్రతతోపాటు కౌంటింగ్ ప్రక్రియ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, నరసింహులు, ఏఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచలకిషోర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భద్రత కఠినతరం చేయండి: ముఖేష్‌కుమార్ మీనా

తిరుపతి(కలెక్టరేట్): పోలింగ్, తర్వాత జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్ గుప్తాతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. అధికారులు స్ట్రాంగ్ రూమ్ పరిశీలించాక సందర్శకుల రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫేక్ న్యూస్‌ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఉచిత భోజనాన్నీ సరఫరా చేయలేరా?

- పేదల కోసం ఆహారం అందజేస్తున్న ముక్కంటి ఆలయం
- దాన్ని ఆస్పత్రికి చేర్చేందుకు నిధులు లేవంట
- రోజుకు రూ.200 వెచ్చించలేక ఆగిన సరఫరా
- పేదలకు తప్పని పస్తులు


శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ప్రజా అవసరాలు తమకేమీ పట్టనట్లు పాలకులు, అధికారులు గాలికి వదిలేశారని నిత్యం విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. ముక్కంటి ఆలయం నుంచి ప్రతిరోజూ ఉచితంగా వచ్చే భోజనాన్ని కూడా పంపిణీ చేయకుండా కేవలం ఆటో అద్దె చెల్లించలేమని సాకు చూపుతూ మంగళం పాడేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కాంట్రాక్టు ద్వారా మూడు పూట్ల నిర్దిష్టమైన పరిమాణంలో ఆహారం అందజేస్తుంటారు. అయితే ఇది కేవలం అడ్మిషన్‌లో ఉన్న రోగులకు మాత్రమే సరఫరా చేస్తారు. అడ్మిషన్‌లో ఉన్న రోగులతో పాటు వారి సంబంధీకులు ఆస్పత్రిలో పెద్ద ఎత్తున నిరీక్షిస్తుంటారు. ఇక మధ్యాహ్నం ఓపీ సమయంలో వందలాది మంది రోగులు, వారి సంబంధీకులు ఆస్పత్రికి వస్తుంటారు. మధ్యాహ్న భోజనం అవసరమైన వారంతా ఆర్టీసీ కూడలికి వెళ్లక తప్పదు. ఈ సమస్యను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి వచ్చేవారంతా రూ.5కే నాణమైన భోజనం అందుబాటులో ఉండడంతో పెద్దఎత్తున ప్రజలు ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్ మూత పడిన విషయం తెలిసిందే. ఇక మళ్లీ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటినుంచి పలువురు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రిలో ఉచిత భోజనం అమలు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు ముక్కంటి ఆలయ అధికారులకు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో గత యేడాది అక్టోబరులో ముక్కంటి ఆలయ నిత్యాన్నదానం నుంచి ఉచితంగా ఆస్పత్రికి భోజనం సరఫరా చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం ప్రతిరోజూ మధ్యాహ్నం సుమారు 150 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ యేడాది మార్చి 1 నుంచి ఆస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ ఆగిపోయింది. ఆలయం నుంచి ఉచితంగా భోజనం ఇచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ప్రతిరోజూ భోజనం ఆస్పత్రికి చేరేందుకు, తిరిగి పాత్రలు ఆలయానికి చేరేందుకు రూ.200 ఆటో బాడుగ అవుతుంది. ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిధుల నుంచి వెచ్చించలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. ఆస్పత్రిలో మెయింటెనెన్స్ నిధులు వెచ్చించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఉచిత భోజనానికి మంగళం పాడేశారు. రూ.12కోట్ల నిధులతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని నిత్యం పాలకులు, అధికారులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆటో బాడుగ కట్టలేమంటూ నిరుపేదల కడుపు కాలుస్తున్నారు. ఈ సమస్య తెలుసుకున్న కొందరు దాతలు ఇటీవల తాము ఆటో అద్దె చెల్లిస్తామంటూ ముందుకు వచ్చారు. కానీ ఆస్పత్రి అధికారుల్లో కనికరం కలగలేదు. ఏదో కారణంతో పేదలకు అన్నాన్ని దూరం చేస్తూనే ఉన్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యతో ప్రభుత్వాస్పత్రిలో ప్రతిరోజూ మధ్యాహ్నం పేదలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయం నుంచి వచ్చే నోటి కాడ కూడును లాగొద్దు అంటూ రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తిరుమల ఘాట్‌లో వ్యాను బోల్తా

అదుపుతప్పి కొండను ఢీకొన్న కారు
12 మందికి స్వల్పగాయాలు




మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన వ్యాన్ - కొండను ఢీకొన్న కారు - అదుపుతప్పి రోడ్డుకు అడ్డుగా నిలబడిన టీటీడీ వాటర్ ట్యాంకర్

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. చెన్నైకి చెందిన 12 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఎనిమిది మంది భక్త బృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఓ వ్యానులో శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. అలిపిరికి సమీపంలో మాల్వాడిగుండం వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. అదృష్టవశాత్తు వాహనంలోని వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో వెనుకవస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ కూడా ఒక్కసారిగా అదుపుకోల్పోయింది. సడన్ బ్రేక్ వేయడంతో వాహనం జారి.. రోడ్డుగా అడ్డుగా నిలబడింది. అలాగే 19వ మలుపు వద్ద కూడా ఓ కారు కూడా అదుపుతప్పి కుడివైపునున్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ చెన్నైకి చెందిన నలుగురు భక్తులు స్వల్పగాయాలో బయటపడ్డారు. వర్షం పడటంతోనే ఈప్రమాదాలు చోటుచేసుకున్నట్టు భక్తులు తెలిపారు.

చిన్నశేష, హంస వాహనాలపై గోవిందుడి విహారం



తిరుపతి(కల్చరల్) మే 17: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు చిన్నశేష వాహనంపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి ఏడు గంటలకు హంస వాహన సేవ నిర్వహించారు. హంసవాహనంపై సరస్వతి రూపంలో కొలువైన గోవిందుడు కనువిందుచేశాడు. ఈ సందర్భంగా నాలుగు మాడ వీధుల్లో భక్తులు స్వామివారికి అడుగడుగునా కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, ఇతర అధికారులు, పండితులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలు జరుగుతాయి.

హింసకు తావులేకుండా చూడండి

అధికారులకు ఈసీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 17: పోలింగ్ ముగిసిన తర్వాత తిరుపతి రూరల్, తాడిపత్రి, అనంతపురం తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనల నేపథ్యంలో ఈసీ అధికారులను అప్రమత్తం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసేవరకు 144 సెక్షన్ అమలు చేసి, ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించింది.

డిగ్రీ పరీక్షలకు 31లోపు ఫీజు చెల్లించాలి

చిత్తూరు (సెంట్రల్), మే 17: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 4, 6 సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 31వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సెంటర్ కోఆర్డినేటర్ మీరా సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె, మే 17: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళివారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఒంటరి ఏనుగు జాడ గుర్తింపు

ఆముదాలకోన ఎస్టీ కాలనీ వద్ద గజరాజు పాదముద్రలు


ఆముదాల కోన ఎస్టీ కాలనీ చెరువు సమీపంలో ఏనుగు పాదముద్రలు

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం ఆముదాలకోన ఎస్టీ కాలనీ పీతల చెరువు సమీపంలోని అటవీప్రాంతంలో ఒంటరి ఏనుగు జాడను శుక్రవారం అటవీ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా పనపాకం డిప్యూటీ రేంజి అధికారి చిన బాబు ఆధ్వర్యంలో ఏనుగు జాడ కోసం గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఏనుగు పాదముద్రలు, వ్యర్థాలు కనిపించాయి. దీంతో ఎస్టీ కాలనీతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు, అటవీ ప్రాంతంలోకి వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఒంటరి ఏనుగు ఈనెల 12న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్యపై దాడి చేసి చంపేసింది. అక్కడి నుంచి పూతలపట్టు మండలం మీదుగా పాకాల మండల సరిహద్దుల్లోకి చొరబడి 13న చెన్నుగారిపల్లె పంచాయతీ సమీపంలో తమిళనాడుకు చెందిన కాతవరాయన్‌పై దాడి చేసి హతమార్చింది.తాజాగా ఆ ఏనుగు తమ ప్రాంతంలో సంచరిస్తోందని తెలిసి ఆముదాల కోన ఎస్టీ కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జాడ తెలిసినందున ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ప్రయత్నిస్తున్నామని అటవీ సిబ్బంది తెలిపారు.

రైలుకింద పడి జార్ఖండ్ వాసి ఆత్మహత్య


రైలు పట్టాలపై పడివున్న మృతదేహం

కుప్పం, మే 17: కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో జార్ఖండ్ వాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసు స్టేషన్ ఎదురుగా పట్టాలపై తలతెగి పడివున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు విచారించగా జార్ఖండ్‌కు చెందిన శ్రావణ యాదవ్ (53)గా తేలింది. ఆయన బెంగళూరుకు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాడు. ఆత్మహత్య చేసుకోవడం కోసమే రైలు పట్టాలపై తలపెట్టి పడు కున్నాడని, చక్రాల కింద తల తెగి మృతిచెందాడని పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వైభవంగా గంగమ్మ శేషవాహన సేవ



అన్నదానంలో భోజనం చేస్తున్న భక్తులు


కుప్పం, మే 17: ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు కుప్పంలో వైభవంగా కొనసాగుతున్నాయి. గత పాలకమండలి పదవీ కాలం ముగియడంతోపాటు ప్రస్తుతం ఆపద్ధర్మ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో నూతన పాలకమండలి నియామకం జరగలేదు. దీంతో రాష్ట్ర దేవా దాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నడుస్తున్నాయి. విరాళాలు పోగేసే అవకాశం అధికా రులకు లేకపోవడంతో ఉన్నంతలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ముత్తుమారెమ్మకు శేష వాహన సేవ శుక్రవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. తొలుత అమ్మవారిని సర్వాలంకృతు రాలిని చేసి శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ మధ్య పట్టణ వీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూ హారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు. రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్ ఆధ్వ ర్యంలో ఈ అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మానవత స్వచ్ఛంద సంస్థ బెంచీల ఏర్పాటు



పుంగనూరు, మే17: పట్టణ పరిధిలో పలు చోట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వ ర్యంలో బెంచీలు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు పూల త్యాగరాజు, నందీశ్వరయ్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సంస్థ ద్వారా రూ.4వేలు విలువ కలిగిన 50 బెంచీలను కూడలి ప్రాంతాల్లో ప్రయాణికుల కోసం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సంస్థ ద్వారా వైకుంఠరథం, ఫ్రీజర్‌బాక్సులు ఏర్పాటు చేసి ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు చేయడానికి సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హరినాథరెడ్డి, ఉదయ్‌కుమార్, నానబాల గణేశ్, అనిల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 17: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించుకున్నారు.

దారి సమస్యపై ఘర్షణ.. ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, మే17: ఇంటి సమీపంలో దారి సమస్యపై జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలో పాళ్యంపల్లె పంచాయతీ నడిమిగడ్డకి చెందిన సురేంద్ర కుమారుడు వెంకటరెడ్డి(30)ని గ్రామంలోని సీసీరోడ్డుపై నడవరాదని అదే గ్రామానికి చెందిన రాజన్న కుమారులు రెడ్డెప్ప, వెంకటరెడ్డి, బాలాజీ దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వెంకటరెడ్డిని కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి



రోగులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ మధుసూధనచారి

పుంగనూరు రూరల్, మే17: ప్రజలు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జీవన విధానాన్ని మార్పు చేసుకోవాలని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ మధుసూదనచారి పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఒత్తిడి దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆస్పత్రిలో ఆవరణలో రోగులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. మానసిక ఒత్తిడికి గురి కావడం వల్ల అనారోగ్యాల పాలవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరిగోపాల్‌నాయక్, జశ్వంత్, శ్రీనివాసులు, రాహులు, రామాంజులునాయక్, ప్రశాంత్, హిమశైలజ, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, మే17: ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి నుంచి రూ. 4150లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

అభివృద్ధి పనులపై ఎంపీపీ సమీక్ష

సదుం, మే 17: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎల్లప్ప అధ్యక్షతన మండల సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. వివిధ శాఖల అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులపై ఎంపీపీ సమీక్షించారు. వేరుశెనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యం అధిగమించినట్లు, ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు త్వరలో నష్టపరిహారం అందజేయ నున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పూర్తిచేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని, తిమ్మానాయునిపల్లె, చీకలచేను గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని సర్పంచులు హను మంతు రెడ్డి, మురళీరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున అధికారులను కోరారు. అంగన్వాడీ కార్యకర్తలకు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని తహసీల్దారు నారాయణస్వామికి ఐసీడీఎస్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజశేఖరబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటును అశ్రద్ధ చేయడం తగదు



కల్లూరు పీహెచ్‌సీలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

కల్లూరు, మే 17: అధిక రక్తపోటును అశ్రద్ధ చేయడం తగదని ప్రభుత్వ వైద్యా ధికారులు హరిప్రియ, సుబ్ర మణ్యం, సుజిత తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ అధిక రక్తపోటు సమస్య మూత్రపిండాల వ్యాధి, గుండె ఆటుపోట్లకు దారితీస్తుందన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, మానసిక ఆందోళన, ఊబకాయం ఉప్పు ఎక్కువగా తీసకోవడం, వంశపారంపర్య లక్షణాలు లాంటి అనేక కారణాలతో అధిక రక్తపోటు సమస్య తలెత్తుతుందన్నారు. రక్తపోటు పట్ల అవగాహనతో జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సదుం: రక్తపోటు సమస్యను అశ్రద్ధ చేయకూడదని చెరుకువారిపల్లె వైద్యాధికారి డాక్టర్ గిరీషా సూచించారు. సదుం పురవీధుల్లో శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీపీ ఉన్నవాళ్లు ప్రతి నెలా వైద్య పరీక్ష చేసుకోవాలని తెలిపారు. బీపీ లక్షణాలు, ముందస్తుగా పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర్, నీలకంఠ, శిఖామణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం ముఖ్యం



కందూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

సోమల, మే 17: ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని ఎస్‌ఐ వెంకటనరసింహులు అన్నారు. శుక్రవారం కందూరు, నంజంపేట, నెల్లిమందలో ఆయన స్థానికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉంటుం దన్నారు. చిన్నపాటి వివాదాలను స్థానికంగా పరిష్కరిం చుకోవాలన్నారు. సారా విక్రయాలు, పేకాట తదితరాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైవీఆర్ ట్రస్టు అన్నదానం

పలమనేరు, మే17 : పలమనేరు గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం గంగమ్మ ఆలయం వద్ద పలమనేరులోని యోగివేమారెడ్డి ట్రస్టు సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టస్టు చైర్మన్ చెంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

రామకుప్పం, మే 17: రామకుప్పం ప్రాంతంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కూడా చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. పదిహేను రోజులుగా వేసవి తాపంతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి.

డాక్టరేట్ ప్రదానం



శాంతిపురం, మే 17 : శాంతిపురం మండలం మఠం గ్రామానికి చెందిన వీ.చంద్రప్పకు ఎస్వీ యూనివర్శిటీ శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. చంద్రప్ప భౌతికశాస్త్రం ఆచార్య సీకే జయశంకర్ పర్యవేక్షణలో 'కంపోజిషన్ డిపెండెంట్ వైట్ లైట్ ఎమిషన్ స్టడీస్ ఆఫ్ డిపై 3+ – డోపెడ్ ఆక్సైడ్ అండ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ లైటింగ్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ మేరకు ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. చంద్రప్ప ప్రస్తుతం గుడుపల్లె మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం అధ్యాపకులుగా పని చేస్తున్నారు. చంద్రప్పకు పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

పుంగనూరు, మే17: యోగా శిక్షణతో మానసిన రోగాలు దూరమవుతాయని యోగా గురువు వనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తయిండ్లు షిరిడి సాయి ధ్యాన మందిరంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో శ్వాస కోస సమస్యలు దరిచేరవన్నారు. శరీరంలోని చెడు ఆమ్లాలు తొలగిపోతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. ప్రతిరోజూ సూర్య నమస్కారం, ఆసనాలు, ప్రాణాయామం తదితర వాటిపై శిక్షణ ఇస్తామని వివరించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మే17: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతా భిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, మే 17: రామకుప్పం మండలం అయ్యప్పగానిపల్లెకు చెందిన కార్యకర్త వేణుగోపాల్ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు వెంకటరమణ, కోదండరెడ్డి, రాధప్ప, శంకరప్ప, నవీన్, సురేష్, రమేష్, జయప్ప తదితరులు శనివారం ఉదయం వేణుగోపాల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

మొక్కుబడిగా సాగిన సోమల మండల మీట్

సోమల, మే 17: సోమల మండల సమావేశం శుక్రవారం మొక్కుబడిగా సాగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశంలో చర్చలు జరగలేదు. ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ సమస్యలు ఉంటే తెలియజేయాలని సభ్యులను కోరారు. సమావేశానికి హాజరైన అధికార పార్టీ సభ్యులు సమస్యలు ఏమీలేవని స్థానికంగా పరిష్కరించుకున్నామని వివరించారు. దీంతో గంటలోపే మమ అనిపించారు. మండలంలో పలుచోట్ల తాగునీటి సమస్యలు ఉన్నా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు చర్చించలేదు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద జలశుద్ధి కేంద్రం బోరు మోటారు పాడైనా పట్టించుకోలేదు. నంజంపేట. సరస్వతీపురం మినరల్ వాటర్ స్కీం పనిచేయడం లేదు. పలు తాగునీటి బోర్లు పనిచేయలేదు. అయినా చర్యలు లేవు.

గెలుపు మాదే.. ఎందుకంటే.. ?

పలమనేరు, మే17: పలమనేరు నియోజకవర్గంలో విజయంపై ఇరుపక్షాలూ ఒకేరకమైన ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. అందుకు కారణాలను విశ్లేషించుకుంటున్నాయి. కూడికలూ, తీసివేతల లెక్కలు కట్టుకుని గెలుపు తనదే అని అటు టీడీపీ అభ్యర్థి అమర్ ధీమా వ్యక్తం చేస్తుండగా, వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ కూడా ఇదే నమ్మకంతో ఉన్నారు. రెండు పార్టీలలోనూ ఇవే అంచనాల చర్చలు సాగుతున్నాయి. అవి ఇలా ఉన్నాయి...

అమర్ ధీమా



- ఈఎన్నికల్లో తన ఎన్నికల వ్యూహాన్ని ఆరేడు నెలల కిందే ప్రారంభించడం.
- గత ఎన్నికల్లో ఎక్కడ మెజారిటీ కోల్పోయారో అక్కడ తనకు ఎవరు వ్యతిరేకంగా పనిచేశారో గుర్తించి, వారిలో చాలామందిని పార్టీలో చేర్చుకోవడం.
- తన సొంత మండలమైన పెద్దపంజాణిలో ఇంతకాలం రాజకీయ ప్రత్యర్థిగా ఉంటూ వచ్చిన మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డిని తెలుగుదేశం పార్టీలో చేర్పించడం.
- నియోజకవర్గంలో తన హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం నిలిపివేసిన ఉదంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం.
- నియోజకవర్గంలో 30 వేలకు పైగా ఉన్న మైనారిటీల సంక్షేమం కోసం మంత్రిగా మంజూరు చేసిన పథకాలు, కళాశాలల గురించి వారికి వివరించడం. వారిలో కొందరిని టీడీపీలో చేర్చుకుని మైనారిటీల ఓట్లు చేజారకుండా చూసుకోవడం.
- పలమనేరు మున్సిపాలిటీలో ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లను, ఇద్దరు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లను టీడీపీలో చేర్పించుకోగలగడం.
- గత ఎన్నికల్లో జనసేనకు వచ్చిన 5వేల ఓట్లు ఈసారి తమకే పడతాయని, పొత్తుల వల్ల ఈ సంఖ్య ఇంకా పెరిగి ఉంటుందని భావించడం.
- వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, డీజిల్ పెట్రోల్ ధరలు, రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం వంటి అంశాలను ప్రజలకు వివరించడంలో విజయం సాధించడం. టీడీపీ మేనిఫెస్టోతో ప్రజలకు జరిగే మంచిని వివరించడం..
- కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ చీఫ్ షర్మిల ప్రచారం చేశారు. ఆ సభకు గణనీయంగా జనసమీకరణ జరగడంతో కాంగ్రెస్ అభ్యర్థికి సైతం 5వేల వరకు ఓట్లు సాధించవచ్చని అంచనా. ఆ ఓట్లు వైసీపీకి చెందినవే కావడంతో వైసీపీ ఓట్లు తగ్గి టీడీపీకి కలిసి వస్తుందని భావించడం.

వెంకటేగౌడ నమ్మకం



- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి వివక్షలేకుండా సంక్షేమ పథకాలు అమలు చేశామని చేసిన ప్రచారం జనంలోకి బలంగా వెళ్లిందనే నమ్మకం. నాడు-నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మారాయని, రైతు భరోసా కేంద్రాలు, అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఏర్పాటు, పలమనేరును రెవెన్యూ డివిజన్‌గా మార్పుచేశామని, వంద పడకల ఆస్పత్రికి నూతన భవనాన్ని నిర్మించామని ప్రచారం చేసుకోవడం.
- 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి మూడువేల ఓట్లతో ఓటమి చెందిన సుబాష్‌చంద్రబోస్ వైసీపీలో చేరడం తమ బలాన్ని పెంచిందనే భావన. అలాగే నియోజకవర్గంలో 80 శాతానికి పైగా ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు తన విజయం కోసం పనిచేశారని భావించడం.
- వలంటీర్ల వ్యవహారంలో కూటమి నాయకుల విమర్శలు వైసీపీకి అనుకూలంగా మారాయని భావించడం.
- సొంత మండలం వికోటలో గతంలో కంటే 5వేలు మెజారిటీ ఓట్లు వస్తాయని నమ్మకం.
- నియోజకవర్గంలోని మైనారిటీల ఓట్లు, 5వేలకుపైగా ఉన్న క్రిస్టియన్ ఓట్లలో 90 శాతం పైగా వైసీపీకే పడుతాయనే ధీమా. అలాగే రెడ్లు 30వేల మంది, ఎస్సీలు మరో 30 వేల మంది, ఉన్నారని వారిలో మెజారిటీ ఓట్లు వైసీపీకే వచ్చాయనే అంచనా. బీసీలు 70వేల మంది పలు పథకాల ద్వారా లబ్ధిపొందారని, వారి ఓట్లు తనకే పడ్డాయని విశ్వసించడం.

పంపిణీకి వేరుశెన విత్తన కాయలు సిద్ధం



విత్తనకాయలను పరిశీలిస్తున్న ఏడీ శివకుమార్‌రాజు

పుంగనూరు రూరల్, మే17: రైతులకు 40శాతం సబ్సిడీతో వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏడీ శివ కుమార్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 111 ఆర్బీకేలలో వేరుశెనగ కాయలు నిల్వ ఉంచినట్లు తెలిపారు. మండలాల వారీగా విత్తనాలు పుంగనూరుకు 1950 క్వింటాళ్లు, చౌడేపల్లెకు 1350 క్వింటాళ్లు, సోమలకు 1088, సదుంకు 890, పెద్దపంజాణికి 1745, గంగవరానికి 1223, రొంపిచెర్లకు 1100, పులిచెర్లకు 1099 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కే6 రకం కిలో రూ.95లు ఉండగా రాయితీతో రూ.38లకు, నారాయణి రకం రూ.97లు ఉండగా రూ.58.20ల ధరను కలెక్టర్ నిర్ణయించినట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, భూ రికార్డులు జిరాక్స్ తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. విత్తనకాయల పంపిణీ తేదీలను ఆయా మండలాల వ్యవసాయాధికారులు నిర్ణయిస్తారని వివరించారు.

రావణ వాహనంపై మృత్యుంజయేశ్వరుడి ఊరేగింపు



చౌడేపల్లె, మే17: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు రావణ వాహనంపై ఆదిదంపతులు ఊరేగారు. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి రావణ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేకంగా పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు సమర్పించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా సజ్జన కులస్తులు వ్యవహరించారు.

కమ్మపల్లిలో వైభవంగా శ్రీరామనవమి



సీతారాములకు ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

కల్లూరు, మే 17: పులిచెర్ల మండలం కమ్మపల్లిలో సీతారామ ఆలయంలో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి పూజతో సంప్రదాయబద్ధంగా వేడుకలు ప్రారంభించారు. అనంతరం కలశస్థాపన, ధ్వజా రోహణం, హోమం, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్టుకు పట్టువస్త్రాల సమర్పణ, ఊంజల్‌సేవ జరిపించారు. రాత్రి 7 గంటలకు సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా పట్టువస్త్రాలు, వివిధరకాల పుష్పాలతో అలంకృతులైన సీతారాములను కళ్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాల నడుమ మాంగళ్య ధారణ జరిపించారు. అనంతరం కమ్మపల్లి పురవీధుల్లో పుష్పపల్లకిలో సీతారాములు విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు వసంతోత్సవం

శనివారం ఉదయం 8 గంటలకు వసంతోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



జ్యోతినగర్‌లో చేతిపంపును పరిశీలిస్తున్న ఎస్‌ఈ విజయ్‌కుమార్

కల్లూరు, మే 17: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు. పులిచెర్ల మండలంలో తాగునీటి సమస్య తలెత్తిన అయ్యావాండ్లపల్లి, దేవళంపేట, వెంకటదాసరపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతినగర్, నల్లగుట్టపల్లి, పెద్దబెస్తపల్లి, బాలిరెడ్డిగారిపల్లి, పొట్టిశిద్దారెడ్డిగారి పల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వేసవికాలం దృష్ట్యా బోర్లలో నీటిమట్టం తగ్గుతోందని, డీప్లింగ్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. చేతిపంపులను ఎక్కడికక్కడ వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలియజేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజేంద్ర, ఏఈ గౌతమి, సిబ్బంది షౌకత్ పాల్గొన్నారు.

కందూరులో డీఎస్పీ విచారణ

సోమల, మే 17: ఎన్నికల ఫలితాలు జూన్ 4 వచ్చే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పలమనేరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రఘువీర్ తెలిపారు. గురువారం రాత్రి కందూరు, ఆవులపల్లెలను ఆయన సందర్శించారు. మే 13వ తేదీ ఎన్నికల సందర్భంగా కందూరు, ఆవులపల్లెలో జరిగిన ఘర్షణలతో 5 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన గ్రామస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఘర్షణలకు పాల్పడరాదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకటనరసింహులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం తగదు



సోమలలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వైద్య బృందం

సోమల, మే 17: గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయరాదని సోమల వైద్యాధికారి జయ సింహ అన్నారు. శుక్రవారం సోమలలో డ్రై డే చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుధ్య పనులు చేయిం చారు. తాగునీటి తొట్టెలను, మురుగు నీరు నిల్వలను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. అలాగే అడు సుపల్లె, దాసరివారిపల్లెలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధి కారులు అమరనాథ్, గీత తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వినాయకుడి కల్యాణం



కల్యాణం తిలకిస్తున్న సింగిరిగుంట గ్రామస్తులు

చౌడేపల్లె, మే17: మండలంలోని సింగిరిగుంటలో వెలసిన సిద్ధి, బుద్ధి వినాయక స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్ల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు సిద్ధి బుద్ధి వినాయక స్వాములకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిరి గుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

విరబూసిన మే పుష్పాలు



మే నెలలో మాత్రమే పూసే మే పుష్పాలు పలమనేరులోని ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లి చెట్ల దేవేంద్ర ఇంట విర బూశాయి. ఈ పుష్పాలను ఇరుగుపొరుగు వారు ఆసక్తిగా తిలకించారు.
- పలమనేరు

శాంతిపురం.. దుర్గంధ భరితం





చెత్తా చెదారంతో నిండిపోయిన శాంతిపురం రాజు కాలువ, దుకాణాల మధ్య పేరుకుపోయిన చెత్తా చెదారం

శాంతిపురం, మే 17: శాంతిపురంలో ప్రజలు దుర్గంధం నడుమ జీవనం సాగిస్తున్నారు. శాంతిపురంలో వందలాది కుటుంబాలు జీవిస్తున్నారు. వారి అవసరాల కోసం ప్రభుత్వం ప్రధాన రహదారి వెంబడి రెండు పక్కల డ్రైనేజీ కాలువలు నిర్మించారు. కేజీఎఫ్ రోడ్డులోనూ కొంత మేర మురుగు కాలువ నిర్మించారు. నెలల తరబడి కాలువలను శుభ్రపరచపోవడంతో చెత్తా చెదారంతో నిండిపోయింది. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాకుండా దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్నారు. ఖాళీ స్థలాల్లో, దుకాణల మధ్యలో ఉండే చెత్తను తొలగించడలేదు. కూరగాయులు, పూలు వ్యాపారం చేసుకొనే దుకాణదారులు పుచ్చిపోయిన కూరగాయులు, వాడిపోయిన పూలను మురుగుకాలువల్లో పడేస్తున్నారు. అలా కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. అంతేకాకుండా శాంతిపురం పాలారు బ్రిడ్జి పక్కనే చికెన్, మటన్ దుకాణాలు ఉన్నాయి. కోళ్లు, పొట్టేళ్లు, చాపలు వంటివి శుభ్రపరిచి వాటి వ్యర్థాలను పాలారు నదిలోకి పడేస్తున్నారు. ఫలితంగా పాలారు నది దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతి ఆదివారం జరిగే సంతకు వచ్చే వ్యాపారస్తులు, కొనుగోలుదారులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. చెత్త పేరుకుపోవడంతో రానుంది వర్షాకాలం కావడంతో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయాలని, పాలారు నదిలో మటన్, చికెన్ వ్యర్థాలను వేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మామిడి కాయలను కోసేసిన అల్లరిమూకలు

లబోదిబోమంటున్నరైతు ● పోలీసులకు ఫిర్యాదు



పూతలపట్టు, మే 17: మామిడికాయలను చెట్లలో నుంచి కోసి, నేలపడేస్తూ కొంతమంది అల్లరిమూకలు శునకానందం పొందుతున్నారు. దీంతో ఆ రైతు లబోదిబోమంటూ శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని పేటమిట్ట గ్రామానికి చెందిన జయచంద్ర నాయుడు స్థానికంగా వున్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ తనకున్న ఎకరా పొలంలో మామిడి మొక్కలను నాటి, అందులో వచ్చే ఫలసాయాన్ని అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదిలా ఉండగాగురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చెట్లలో వున్న మామిడి కాయలను కోసి, నేలపై పడేసి వెళ్ళిపోయారు. శుక్రవారం ఉదయం ఆ రైతు మామిడి చెట్లవద్దకు వెళ్ళి చూడగా, మామిడి కాయలు నేలపై పడివుండడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. సుమారు రూ. 40వేలు విలువ చేసే ఒక టన్ను మామిడికాయలు నేలపాలు చేశారని సీఐ సుదర్శనప్రసాద్‌కు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

నీటి సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం, మే 17: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే గ్రామీణ నీటి సరఫరా అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ లత అధికారులకు సూచించారు. కార్వేటినగరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లత ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. నీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, బోర్ల మరమ్మతులు చేయాలని కోరారు. జాబ్ కార్డ్ కలిగిన ఉపాధి కూలీలకు అందరికీ ఉపాధి కల్పించే పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పులివర్తి నానికి టీడీపీ నాయకుల పరామర్శ



బంగారుపాళ్యం, మే 17: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మండల టీడీపీ నాయకులు పరామర్శించారు. మరామర్శించిన వారిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరక్టర్ మహేంద్ర, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి, మాజీ ఎంపీటీసీ నాగరత్నం, సర్పంచ్ రమేష్, నాయకులు జయరామి రెడ్డి, పెరుమాళ్, వేణు, తిరుమలయ్య, రుషేంద్ర రెడ్డి ఉన్నారు.

రావణ వాహనంపై మృత్యుంజయేశ్వరుడి ఊరేగింపు



చౌడేపల్లె, మే17: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు రావణ వాహనంపై ఆదిదంపతులు ఊరేగారు. శుక్రవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి రావణ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేకంగా పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు సమర్పించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా సజ్జన కులస్తులు వ్యవహరించారు.

జూదరుల అరెస్ట్

పుంగనూరు రూరల్, మే17: ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి నుంచి రూ. 4150లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

పాలసముద్రంలో మోస్తరు వర్షం

పాలసముద్రం : మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి దంచికొట్టిన ఎండలు, సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం వల్ల మామిడి, చెరకుతోటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర







పొన్నియమ్మ ఆలయంలో పొంగళ్ళు పొంగిస్తున్న భక్తులు, పూజ సామగ్రి తెస్తున్న మహిళా భక్తులు

చిత్తూరు నగరంలో నడివీధి గంగమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. శుక్రవారం పొన్నియమ్మ గుడిలో ధర్మకర్త సీకే లావణ్యబాబు కుటుంబంతోపాటు భక్తులు పొంగళ్ళు పొంగించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు గుణశేఖర్, సంపత్‌కుమార్, విజయ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో భక్తులకు ఈవో మునిశేఖర్, వీకే. విశ్వనాథ్‌లు పూజ సామగ్రిని అందజేశారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. - చిత్తూరు కల్చరల్



అమ్మవారి సేవలో సీకే లావణ్యబాబు

గ్రామాల్లో జాతర సందడి





ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి, రామాపురంలో తురకానమ్మకు అంబళ్ళు పోస్తున్న గ్రామస్తులు

గుడిపాల, మే 17: మండలంలోని పలు గ్రామాల్లో జాతర్లను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. 197 రామాపురంలో తురకానమ్మ, నంగమంగళంలో మూగపుట్టాలమ్మ తిరుణాళ్ళను గ్రామస్థులు దేవరెద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు అంబళ్ళు పోసారు. 197రామాపురంలో వెలసిన వీరబ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బ్రహ్మయ్య, ఆనంద్, గ్రామపెద్దలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గంగ జాతర పనుల ప్రారంభం

ఐరాల, మే 17: గార్గేయి నదీతీరాన వెలసిన పాలేటమ్మ గంగమ్మ ఆలయంలో శుక్రవారం మహిళా భక్తులు తొలిగుంజకు పూజలు చేసి జాతర పనులను ప్రారంభించారు. ఈనెల 28, 29 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త ఎంకే.బాలాజీ తెలిపారు. ఇందులో భాగంగా 28న వేకువజామున 3 గంటలకు అమ్మవారి శిరస్సు ప్రతిష్ఠ, 4 గంటలకు ఘట నైవేద్య సమర్పణ, 4.30 గంటలకు అమ్మవారికి బొట్టు మెరుగు పెట్టు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 29న సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాళ్లు, రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.



తొలిగుంజకు పూజ చేసి పాతుతున్న మహిళలు

కలెక్షన్ లేదనే నెపంతో బస్సుల రద్దు

● ఇబ్బందులు పడుతున్నగ్రామీణులు
● పునరుద్ధరించాలని వేడుకోలు



పాలసముద్రం, మే 17: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ అధికారులు కలెక్షన్ లేదనే నెపంతో బస్సులు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బలిజకండ్రిగ నుంచి పాలసముద్రం మీదుగా తిరుమలరాజుపురం వెళ్ళే ఆర్టీసీ బస్సు, చిత్తూరు నుంచి రంగాపురం మీదుగా రామకృష్ణాపురం నడిచే బస్సును చిత్తూరు-2 డిపో అధికారులు రద్దు చేశారు. పుత్తూరు నుంచి వనదుర్గాపురానికి పుత్తూరు డిపో అధికారులు గతంలో బస్సులు నడిపేవారు. గత 3-4 ఏళ్ళ క్రితం అధికారులు ఈ మార్గాల్లో నడిచే ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ఈ మార్గాల్లో ఆర్టీసీ బస్సులను తిరిగి నడపాలని ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. మండలకేంద్రం నుంచి తిరుమలరాజుపురం, గంగమాంబాపురం, నరసింహాపురం, కోదండరామాపురం, బాలకృష్ణాపురం పంచాయతీలకు ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. ఈ పంచాయతీల ప్రజలు బస్సుల కోసం 4-5 కి.మీ కాలినడకన లేదా ద్విచక్రవాహనాల్లో వెళ్లి బస్సులు ఎక్కాల్సివస్తోంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకుని బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటిగుంట ఆక్రమణలను అరికట్టాలి





నీటిగుంట కట్టపై వెలసిన పూరిపాక, ఆక్రమణలకు గురైన కట్ట ప్రాంతం

కార్వేటినగరం, మే 17: మండలంలోని ఎంఎం విలాసం పంచాయతీ వడ్డిండ్లు పక్కన ఉన్న నీటి గుంట ఆక్రమణలు వెంటనే అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. గత 50 ఏళ్లుగా ఉన్న నీటిగుంట ఇటీవల కాలంలో ఆక్రమణల గురవుతోంది. భూగర్భ జలాల పెంపు కోసం గతంలో ఏర్పాటైన ఈ నీటి గుంట ఆరు నెలల కాలంలో గుంటకు ఉత్తర దిశగా మట్టిని తోలి పూడ్చివేతకు గురువుతోంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇటీవల గడపగడప కార్యక్రమంలో వడ్డిండ్లు దగ్గర ఇల్లులేని వారికి ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని సాకుగా చూపించి నీటి గుంట వద్ద మట్టని తోలి చదును చేసి నామరూపాలు లేకుండా చేస్తున్నారు. మట్టి తోలి గుంటకట్టను ఆక్రమిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అక్కడే ఒక పూరిపాక వెలిసింది. నీటిగుంటలో కట్ట ప్రాంతంలో ఇలా ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి నీటిగుంట ఆక్రమణలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



చేతిపంపును పరిశీలిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

కల్లూరు, మే 17: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయ్ కుమార్ తెలిపారు. పులిచెర్ల మండలంలో తాగునీటి సమస్య తలెత్తిన అయ్యావాండ్లపల్లి, దేవళంపేట, వెంకటదాసరపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జ్యోతినగర్, నల్లగుట్టపల్లి, పెద్దబెస్తపల్లి, బాలిరెడ్డిగారిపల్లి, పొట్టిశిద్దారెడ్డిగారి పల్లిలో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నా మన్నారు. ముందుగా నీటి సమస్య తలెత్తిన బోర్లను డీప్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. అప్పటికీ బోర్లలో నీరురాని పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తామి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా బోర్లలో నీటిమట్టం తగ్గుతోందని, డీప్లింగ్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. చేతిపంపులను ఎక్కడికక్కడ వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజేంద్ర, ఏఈ గౌతమి, సిబ్బంది షౌకత్ పాల్గొన్నారు.

గంగమ్మ శేషవాహన సేవ

కుప్పం, మే 17: ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు కుప్పంలో వైభవంగా కొనసాగుతున్నాయి. గత పాలకమండలి పదవీ కాలం ముగియడంతోపాటు ప్రస్తుతం ఆపద్ధర్మ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో నూతన పాలకమండలి నియామకం జరగలేదు. దీంతో రాష్ట్ర దేవా దాయ ధర్మా దాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నడుస్తున్నాయి. విరాళాలు పోగేసే అవకాశం అధికా రులకు లేకపోవడంతో ఉన్నంతలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ముత్తుమారెమ్మకు శేష వాహన సేవ శుక్రవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. తొలుత అమ్మవారిని సర్వాలంకృతు రాలిని చేసి శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ మధ్య ఊరేగించారు. మహిళలు కర్పూ హారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు. రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిం చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

23న వేలం పాటలు

చిత్తూరు కల్చరల్, మే 17: చిత్తూరు సంతపేటలోని దేవదాయశాఖకు చెందిన శ్రీ పురం వెంకట్రాయశెట్టి సత్రం ఖాళీ స్థలం, రెండు దుకాణాలకు ఈనెల 24న అద్దె ప్రాతి పదికన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు. మూడు సంవత్సరాలకు అద్దెకు గాను వేలం పాటలు నిర్వహిస్తున్నామని, హెచ్చు పాట దారులకు స్థలం, దుకణాలు కేటాయించనున్నామని, ఆసక్తి గల వేలంలో పాల్గొనాలని కోరారు.

ఐరాల మండలానికి చేరిన వేరుశనగ విత్తన కాయలు



ఐరాల, మే 17: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ ద్వారా వేరుశనగ విత్తన కాయలు ఆర్బీకేలకు సరఫరా చేశారు. శుక్రవారం 8 ఆర్బీకేలకు గాను 470 క్వింటాళ్ల విత్తన కాయలను సరఫరా చేసినట్లు ఏవో వరలక్ష్మి తెలిపారు. వచ్చేవారంలో విత్తన కాయలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలియజేశారు. విత్తన కాయలు అవసరమైన రైతులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 1710 క్వింటాళ్ల విత్తన కాయలను సరఫరా చేయనున్నట్లు ఆమె వివరించారు.

వరసిద్ధుడి సేవలో తిరుపతి కలెక్టర్



ఐరాల(కాణిపాకం), మే 17: తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, మే 17: మండలకేంద్రమైన గుడిపాలలో నిరుపేదల ఆకలి తీర్చడానికే అన్నక్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు చల్లా, జయశీలన్, సుధాకర్ యాదవ్, ఆనంద్ యాదవ్, రాసనపల్లి రవి నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఫియోటల్ డాప్లర్ టెస్టింగ్ కిట్ వితరణ



గంగాధరనెల్లూరు, మే 17: గర్భిణి కడుపులో ఉన్న బిడ్డ శ్వాస తెలుసుకోవడానికి ఫియోటల్ డాప్లర్ టెస్టింగ్ కిట్ ఉపయోగపడుతుందని పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి ప్రోత్సాహంతో చిత్తూరు నగరానికి చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్, దాత శ్రీధర్‌రెడ్డి సహకారంతో గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవికి ఫియోటల్ డాప్లర్ టెస్టింగ్ కిట్‌ను ఉచితంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి ప్రతినెలా 9, 10వ తేదీల్లో టెస్టింగ్‌ల కోసం వచ్చే గర్భిణులకు ఈ కిట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, ఫార్మాసిస్ట్ నాగలక్ష్మి, స్టాఫ్‌నర్స్ నిర్మల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

పుంగనూరు, మే17: యోగా శిక్షణతో మానసిన రోగాలు దూరమవుతాయని యోగా గురువు వనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తయిండ్లు షిరిడి సాయి ధ్యాన మందిరంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. యోగాసనాలు వేయించారు. ఆమె మాట్లాడుతూ యోగాతో శ్వాస కోస సమస్యలు దరిచేరవన్నారు. శరీరంలోని చెడు ఆమ్లాలు తొలగిపోతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. ప్రతిరోజూ సూర్య నమస్కారం, ఆసనాలు, ప్రాణాయామం తదితర వాటిపై శిక్షణ ఇస్తామని వివరించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 17: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించుకున్నారు.